

'బుల్లెట్ ట్రైన్ రానుంది..!'

చెన్నయ్-మైసూర్ దూరం తగ్గనుంది

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఉమ్మడి చిత్తూరు జిల్లా రైల్వే పరంగా ఎంతో వెనకబడి ఉంది. జిల్లాల విభజన తరువాత ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ నేపథ్యంలో చిత్తూరు మీదుగా బుల్లెట్ ట్రైన్ రానుందనేది ఈ ప్రాంతవాసులకు శుభవార్తే. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గాంధీనగర్ నుంచి ముంబాయికి బుల్లెట్ ట్రైన్ పనులు జరుగుతున్నాయి. ఇది దేశంలో మొట్టమొదటి బుల్లెట్ ట్రైన్ అవుతుంది. అలాగే చెన్నై నుంచి మైసూర్‌కు బుల్లెట్ ట్రైన్ నడపాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చెన్నై నుంచి బెంగళూరు వయా మైసూరు వెళ్లాలంటే సుమారు పది గంటలు సమయం పడుతుంది. బుల్లెట్ ట్రైన్ పనులు పూర్తయితే చెన్నై నుంచి మైసూర్‌కు సుమారు రెండు నుంచి రెండున్నర గంట సమయం పడుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా మీదుగా ఈ బుల్లెట్ ట్రైన్ నడపడానికి రైల్వే ఉన్నతాధికారులు ప్రణాళికను రచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇటు కర్ణాటక అటు తమిళనాడు సరిహద్దు కావడంతో ఇటు వ్యాపారంగా అటు విద్య, వైద్య ఎంతోమంది చిత్తూరు జిల్లా వాసులకు బుల్లెట్ ట్రైన్ రావడంతో ఎంతో సమయం కలిసి రానుంది. చెన్నై హార్డ్‌వేర్ రంగంలో అభివృద్ధి చెందగా, మైసూరు సాఫ్ట్‌వేర్ రంగంలో అభివృద్ధి చెందింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఎంతోమంది విద్య వైద్య పరంగాప్రయాణం సాగిస్తూ ఉంటారు. సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఇబ్బందులు అన్ని ఎన్ని కావు. గత రైల్వే బడ్జెట్లో చెన్నై మైసూర్ మధ్య బుల్లెట్ ట్రైన్ నడపాలని కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదనలు తయారు చేశారు. అందుకు అనుగుణంగా ఈ పనులు సాగుతున్నాయి. బుల్లెట్ ట్రైన్ కు ప్రత్యేక రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయాలని అందుకు తగ్గట్టుగా ప్రణాళికను రచిస్తున్నారు. ఈ పనులు దక్కించుకోవడానికి ఎల్ అండ్ టి సంస్థ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. చెన్నై మైసూర్ మధ్య బుల్లెట్ ట్రైన్ పనులు ఐదేళ్ల లోపు పూర్తి చేయాలని కేంద్రం భావిస్తుంది. బుల్లెట్ ట్రైన్ చిత్తూరు మీదుగా వెళ్లడం వల్ల ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.మూడు రాష్ట్రాల మీదుగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకను కలుపుతూ 340 గ్రామాల మీదుగా బుల్లెట్ ట్రైన్ రాకపోకలు సాగించేలా అధికారులు డీపీఆర్ రూపొందించారు. సాధారణంగా చైన్నై నుంచి మైసూర్‌కు రైలులో వెళ్లాలంటే దాదాపు 10 గంటల సమయం పడుతుంది. అదే బుల్లెట్ ట్రైన్‌లో అయితే కేవలం 2 గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ ట్రైన్‌కు చిత్తూరులో స్టాపింగ్ ఇవ్వడంతో జిల్లావాసులకు సైతం సేవలందించనుంది.

చిత్తూరు స్టాపింగ్ మీదుగా...

జిల్లాలోని 41 గ్రామాల మీదుగా బుల్లెట్ ట్రైన్ ప్రయాణించనుంది. ఈ మేరకు 435 కిలోమీటర్ల వరకు 18 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ నిర్మించేందుకు డిజైన్ రూపొందించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ ఇప్పటికే శాటిలైట్, ల్యాండ్ సర్వే పూర్తి చేసింది. 750 మంది ప్రయాణికులతో గంటకు 250 నుంచి 350 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ ట్రైన్ వెళ్లేందుకు వీలుగా ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లె వద్ద చిత్తూరు స్టాపింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

ప్రత్యేక రైల్వేట్రాక్‌కు భూసేకరణ
పనులు చేపట్టేలా ఎల్అండ్ టి యత్నం

రైతులకు ఐదు రెట్లు పరిహారం

ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీఎల్ అధికారులు భూసేకరణలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు.. 41 గ్రామాలకు గాను 30 గ్రామాలకు చెందిన రైతులతో ఇప్పటికే సమావేశాలు పూర్తి చేశారు. వారి అభిప్రాయాలను పకడ్బందీగా సేకరిస్తున్నారు. భూములు ఇచ్చిన వారి కుటుంబంలో చదువుకున్న వారికి ఏదో ఒకవిధంగా ఉద్యోగావకాశం కల్పిస్తామని అధికారులు హామీ ఇస్తున్నారు. దీనిపై పలువురు రైతులు సుముఖత వ్యక్తం చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.బుల్లెట్ ట్రైన్‌లో ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. కేవలం రెండు గంటల్లోనే చైన్నై నుంచి మైసూర్‌కు వెళ్లిపోవచ్చు. మొత్తం ఫ్లైఓవర్ మీద వేసిన ట్రాక్‌పైనే రైలు వెళుతుంది. ఇందుకోసం భూసేకరణ చేపట్టాం. రైతులకు మార్కెట్ ధర కంటే ఐదు రెట్లు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు.

పండుగ రోజుల్లోనూ 'పట్టు'వీడక..

ప్రజాశక్తి - గూడూరు టౌన్, యంత్రాంగం

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం పెంచాలన్న ప్రధాన డిమాండ్లతో చేస్తున్న సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరుకుంది. సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎస్. సురేష్ మాట్లాడుతూ ఐసిడిఎస్ బలోపేతానికి బడ్జెట్ పెంచాలన్నారు. సుప్రీం తీర్పు మేరకు గ్రాడ్యుటీ తక్షణమే అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి, కార్యదర్శి ప్రభావతి, సెక్టార్ లీడర్స్ మునికుమారి, మంగమ్మ, లక్ష్మిప్రసన్న, భారతి పాల్గొన్నారు.

– నాయుడుపేటలో ఐసిడిఎస్ వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సంఘీభావం ప్రకటించారు. అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేసే విధానాన్ని మానుకోవాలని సిడిపిఒ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రైతుల ఆందోళన విషయంలో బిజెపి ప్రభుత్వం కాలయాపన చేసిందని, ఇపుడు జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలను పండగ పూట రోడ్లపై కూర్చోబెట్టారన్నారు. ఇదే విధానాలు కొనసాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.శ్యామలమ్మ, నాగమ్మ, కళావతి, వాణి, సంధి, సిఐటియు నాయకులు శివకవి ముకుంద పాల్గొన్నారు.

– నారాయణవనంలో రాజకీయ, అధికారుల బెదిరింపులకు భయపడేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు పద్మావతి, నరసమ్మ,

37వ రోజూ అంగన్‌వాడీల సమ్మె

జ్యోతి, వాణి హెచ్చరించారు.

– రేణిగుంటలో 37 అంకె ఆకారంలో అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మలు సమ్మెను కొనసాగించారు. 25వ రోజు రిలే దీక్షల్లో 10 మంది నిరసన తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ధనమ్మ, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణి దుర్మార్గ చర్యన్నారు. జగనన్న ప్రభుత్వం చర్చలకు పిలిపించి వెంటనే జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విజయలక్ష్మి, అంబికా, పార్వతి, రేవతి, లక్ష్మి, ప్రభావతి, పాండురంగమ్మ, ఉష ఐఎఫ్టియు నాయకులు రాధమ్మ, విజయలక్ష్మి, సిపిఎం సీనియర్ నాయకులు వెంకటరమణ, ఏర్పేడు మండలం సిఐటియు కార్యదర్శి కరీముల్లా, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్ సమ్మెకు మద్దతుగా నిలిచారు.

– తిరుపతి టౌన్‌లో పాత కార్పొరేషన్ కార్యాలయం వద్దనే సమ్మె కొనసాగుతోందని నగర అధ్యక్షురాలు జయప్రద, ఎల్లమ్మ, గోమతి,గీత తెలిపారు.

– పుత్తూరు టౌన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, అంగన్‌వాడి నాయకురాలు మునికుమారి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగింది.

– వెంకటగిరిలో సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎ.మంజుల, ఎన్.స్వరూపరాణి, సుభాషిని ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా రిలేదీక్షలను కొనసాగించారు.

– సూళ్లూరుపేటలో మేకల హైమావతి, సిఐటియు నాయకులు రమణయ్య, పద్మనాభయ్య ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది.

అంబేద్కర్‌కు నివాళి

తిరుపతి సిటి : రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన "సామాజిక సమత సంకల్పం" కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఏపీఎస్ఆర్టిసి బస్టాండ్ సర్కిల్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మానవహారంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డా. బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలతో సామాజిక న్యాయం అమలు చేస్తుందని అన్నారు. ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోన్‌రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైదానంలో దాదాపు రూ.400 కోట్లతో 10 ఎకరాలలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెడస్టల్‌తో కలిపి 210 అడుగులతో ప్రారంభించనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, బి.సి వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ఆడుకోవద్దు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు విమర్శించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ, వివిధ మతాలకు సంబంధించిన, వైసిపి పార్టీకి చెందిన క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్నారే తప్ప జాబ్ క్యాలెండర్లు విడుదల చేయలేదని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక 2020లో అప్పటి విద్యా శాఖ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ త్వరలో డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. ఆయన తర్వాత విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బొత్స సత్యనారాయణ త్వరలో డీఎస్సీ అంటూ ప్రకటనలు ఇస్తున్నారే తప్ప డీఎస్సీ నోటిఫికేషన్లు మాత్రం ప్రకటించలేదన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించే తరుణంలో డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, గడిచిన సంవత్సరాలు ఎందుకు డీఎస్సీ నిర్వహించలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓట్లు కోసమే మెగా డీఎస్సీ అని తేటతెల్లమైందన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణ యాదవ్, వాసు పాల్గొన్నారు.

తర్పనాలకు విశాల ప్రదేశం ఇవ్వండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద తిరుపతి నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పర్వదినాల్లో వారి పితదేవతలకు తర్పణ కార్యక్రమాలు చేసుకోవడానికి వస్తుంటారని, విశాల ప్రదేశాన్ని తర్పణ కార్యక్రమం నిర్వహించుకోవడానికి ఇవ్వాలని టీటీడీని శ్రీ కపిలేశ్వర పురోహిత సేవా సంఘం గౌరవ సలహాదారు సంస్కార్ రాజేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం కార్యదర్శి పారా విజయకుమార్ మాట్లాడుతూ రెండు రోజులకు ముందు సంక్రాంతి రోజున పిత తర్పణ కార్యక్రమానికి తిరుపతి నగరంలో నుండి కపిలతీర్థం వద్దకు వేలాది సంఖ్యలో ప్రజలు రావడంతో కొంత అసౌకర్యం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే కొంతమంది శ్రీవారి సంఘం పేరుతో, వివిధ ప్రాంతాల నుంచి ముందురోజు రాత్రే అక్కడకు చేరుకుని ముందస్తుగా పట్టలు పరిచారన్నారు. దీంతో తిరుపతిలో స్థానికంగా ఉండే బ్రాహ్మణులు ఇబ్బందులు పడాల్సివచ్చిందన్నారు. టిటిడి నిఘా అధికారులు ఇకపై గుర్తింపు ఉన్న వారినే క్రమ పద్ధతిలో కూర్చోపెట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధ్యక్షులు అన్నదానం అనిల్, కోశాధికారి మోహన శర్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పౌరోహిత సంఘం నాయకులు



రాధాకృష్ణ మృతికి ప్రగాఢ సంతాపం

ప్రజాశక్తి- రేణిగుంట

గాజులమండ్యం దళితవాడకు చెందిన గాలి రాధాకృష్ణ (55) మృతికి సిపిఎం రేణిగుంట మండల కమిటీ బుధవారం ప్రగాఢ సంతాపం ప్రకటించింది. గాజులమండ్యం గ్రామంలో అతని స్వగృహం వద్ద జరిగిన అంత్యక్రియలకు నాయకులు వెంకటరమణ, శివానందం, చిరాలయ్య, సెల్వరాజ్, జానపద వత్తి కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు పాల్గొని అతని కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. మండల కార్యదర్శి కె.హరినాథ్ మాట్లాడుతూ గాలి రాధాక్రిష్ణ దళిత సామాజికవర్గంలో పుట్టి జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్రకమిటి సభ్యుని స్థాయికి ఎదిగారన్నారు. సిపిఎం సభ్యునిగానూ పేదలకు అండగా నిలిచి పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈనెల 16న గుండెపోటుతో మృతిచెందడం పార్టీకి తీరని లోటని అన్నారు.

22కల్లా ఓటర్ల తుది జాబితా సిద్ధం

తిరుపతి టౌన్ : ఓటర్ల తుది జాబితా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్‌లెవల్ ఏజెంట్లు, అధికారుల కృషితో ఈనెల 22కల్లా సిద్ధమవుతుందని కమిషనర్ హరిత వెల్లడించారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటర్లకు అవగాహన కోసం ఈవిఎంలపై అవగాహన కల్పించామన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎంఆర్ఒ వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీవ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు గ్రేడ్2 జూనియర్ లైన్‌మెన్ల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గ్రేడ్ 2 జూనియర్ లైన్‌మెన్‌లకు ప్రొబేషన్ డిక్లరేషన్ ఎఎల్ఎం ప్రమోషన్లు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్‌చేశారు. 2019, అక్టోబర్ 2న రాష్ట్రంలోని మూడు డిస్కంలలో 7,329 మంది గ్రేడ్ 2 జెఎల్ఎంలను నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భర్తీ చేసింది. అయితే కొంతమంది స్వార్థంతో ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా చెబుతూ రెచ్చగొడుతున్నారు. విద్యుత్ రంగంలో భవిష్యత్ ఎనర్జీ అసిస్టెంట్లది కీలకం కాబోతుంది. ఈ నేపథ్యంలో వీరు సచివాలయ ఉద్యోగులా? విద్యుత్ ఉద్యోగాలా? అనే సందేహం నాలుగేళ్ల నుంచి నడుస్తోంది. విధి నిర్వహణలోనే ఇప్పటికి రాష్ట్రవ్యాప్తంగా 212 మంది మరణించారు. వందలాది మంది అంగవైకల్యం చెందారు. రెండేళ్ళు పూర్తి కాగానే ప్రొబేషన్ డిక్లేర్ చేయాల్సి ఉండగా విద్యుత్ సంస్థ ఆ పనిచేయకుండా తప్పుకుంటోంది. ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్ సంస్థలోని సెక్షన్ ఆఫీసర్ ఎఇ కంట్రోల్లో పనిచేస్తున్నారు. అయితే సచివాలయం వారికి ఇస్తున్న బేసిక్‌తో హెచ్‌ఆర్ఎ, డిఎ కలిపి వారి జీతాలను విద్యుత్ సంస్థ చెల్లిస్తోంది. సచివాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా జీతాలను చెల్లిస్తున్నారు. అయితే ఎనర్జీ అసిస్టెంట్లకు విద్యుత్ సంస్థ నేరుగా జీతాలను ఇస్తోంది. ప్రొబేషన్ డిక్లేర్ చేయగానే ప్రమోషన్లు ఇవ్వాలి, ఎర్న్ లీవ్‌లు, మెడికల్ లీవ్‌లు డిపార్టుమెంట్ జెఎల్ఎంలకు వర్తించే సదుపాయాలను వీరికి కల్పించాల్సి ఉంది. అయితే ఇవేమీ వారికి అమలు కాకపోవడంతో ఎనర్జీ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో 19న తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ ఆఫీసు ముందు మహాధర్నా జరుగుతుందని కందారపు మురళి పేర్కొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించేలా ఉన్నతస్థాయి అధికారులు రాతపూర్వకమైన హామీ ఇవ్వాలన్నది వారి ప్రధాన డిమాండ్.

స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

వైయస్ షర్మిల ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలుగా నియామకం కావడంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగిందని, క్షేత్రస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎఐసిసి ఆధ్వర్యంలో పార్లమెంటరీ కోఆర్డినేటర్లను నియమించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీని వీడినటువంటి ముఖ్య నాయకులు, ప్రధాన భూమిక పోషించిన కార్యకర్తలు తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి మొగ్గు చూపుతున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుంటున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఇండియా కూటమితో దేశంలోనే కాక రాష్ట్రంలో కూడా బలమైన శక్తిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కొన్ని అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోనున్నారని చెప్పారు. పిసిసి కార్యదర్శి గౌడపేరు చిట్టిబాబు, పిసిసి సభ్యులు సిద్దయ్య, తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చిత్తూరు శివశంకర్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఏప్రిల్ కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ నెల తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనుంది. ఏప్రిల్ నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్ లైన్ లక్కీడిప్ కోసం జనవరి 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు జనవరి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

తప్పుడు వార్తలు రాయొద్దు : మాజీ మంత్రి పరసారత్నం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తనను ఎల్లప్పుడూ వెన్నుతట్టి ప్రోత్సహించేది చంద్రబాబునాయుడని, పులివర్తి నానిని పరామర్శించిన తరువాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనను ఎవరూ నిల్చోమని చెప్పలేదని మాజీ మంత్రి పరసారత్నం స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ విలేకరుల సమావేశంలో తాను నిల్చుని ఉండటాన్ని కొన్ని పత్రికలు తప్పుడు వార్తలుగా చిత్రీకరించడాన్ని ఖండించారు. దళితుల పట్ల బాబుకు చిన్నచూపే ఉంటే, సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి తనకు ఆరుసార్లు ఎంఎల్‌ఎగా అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. అంతో ఇంతో దళితులకు మంచి జరిగిందంటే అది టిడిపి హయాంలోనేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగూరు కోదండ రామయ్య, రేవతి, సుబ్బయ్య పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరసారత్నం

'బడి' ప్రచారం 'గల్లా' కుట్రేనా..?

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి)

తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల గ్రామానికి చెందిన మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ముఖ్య అనుచరుడు, నమ్మిన బంటు బడి సుధాయాదవ్ తాను చంద్రగిరి నియోజకవర్గంలో రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రచారం చేస్తుండటం గల్లా అరుణకుమారి కుట్రలోని భాగమేనా? లేక ఇంకేమైనా ఉందా? అనే అనుమానాలను రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎమ్మెల్యేగా పోటీ చేయవచ్చు. అయితే తన పోటీ స్వతహాగా ఉండాలి తప్ప ఇతర నాయకుల సలహాతో మరొక పార్టీని ఇరుకున పెట్టే విధంగా చేస్తే మంచిదికాదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది. తనకు బలమైన తన 'యాదవ' సామాజిక వర్గం తో పాటు గల్లా కుటుంబం ఆశీస్సులు ఉన్నాయని, తెదేపా అధిష్టానం తన వైపే మొగ్గు చూపిస్తోందని, తనకు గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని బడి సుధా యాదవ్ ప్రచారం చేస్తున్నారు. నిజంగానే గల్లా అరుణకుమారి ఆశీస్సులతోనే ఈయన బరిలోకి దిగుతున్నారా లేక స్వతహాగానే ఇలాంటి ప్రకటనలు ఇస్తున్నారా అన్నది తెలియటం లేదు. ఒకవేళ స్వతహాగా ఆయనే ప్రకటించుకుంటూ ప్రచారం చేస్తుంటే గల్లా ఖండించకపోవడంలో ఆంతర్యమేమిటని రాజకీయ విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తనకు అవకాశం ఇస్తే ఎంఎల్ఏగా పోటీ చేస్తానని,ఒకవేళ తనకు టికెట్ కేటాయించకపోయినప్పటికీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రచారం చేసుకొంటున్నారు. చంద్రగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పులివర్తి నానిని ఎప్పుడో అధిష్టానం ప్రకటించినప్పటికీ టిడిపి శ్రేణులను గందరగోళపరచాలన్న ఉద్దేశంతోనే బడి సుధాయాదవ్ ఉన్నారన్న చర్చ నడుస్తోంది.

ఇదిలా ఉండగా బడి సుధాయాదవ్ మండలాలలో తిరుగుతూ ప్రముఖంగా తన సామాజిక వర్గ ప్రజలు, ఆయా మండలాలలో గల రాజకీయ ప్రధాన నేతలను కలిసి స్వీట్లు, కేలండర్లను పంపిణీ చేశారు. తాను పంపిణీ చేసిన స్వీట్ బాక్స్ లపై గల్లా జయదేవ్, గల్లా అరుణకుమారి ఫోటోలు ముద్రించటంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. గల్లా ప్రమేయం లేకపోతే వారి ఫోటోలను స్వీట్ బాక్స్ లపై ముద్రించడాన్ని గల్లా కుటుంబం ఖండించి ఉండేవారు. తన తండ్రి రాజగోపాల్ నాయుడు రాజకీయ వారసత్వం పుచ్చుకొని కాంగ్రెస్ పార్టీలో ఓ వెలుగు వెలిగి మంత్రిగా పనిచేసిన గల్లా చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీని వీడకుండా ఉండాల్సింది. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కుదేలైన సందర్భంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొని తెలుగుదేశం పార్టీ టికెట్ తెచ్చుకొని 2014 సంవత్సరంలో చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పై పోటీలో నిలిచి 4518 ఓట్లు తేడాతో ఓటమి చవి చూశారు. 'ఆఫ్ ది రికార్డ్ చెప్పాలంటే అప్పట్లో అంటే 2014 లో ఆర్థికంగా అరుణకుమారితో పోలిస్తే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండేది. ఓటర్లకు తాయిలాలు (నగదును) పంచే క్రమంలో తమ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను నమ్మకుండా తన కంపెనీ మనషులనే స్వయంగా రంగంలోకి దించి ఓటర్లకు నగదు పోటా పోటీగా పంపిణీ చేసింది. దీంతో ఓ విధంగా ద్వితీయ శ్రేణి నాయకుల మనసును గాయపరచటంతో వారు అంతంత మాత్రమే ప్రచారం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా అప్పట్లో కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అమ్ముడుపోయినట్లు తనకు సమాచారం అందిందని ఆ నాయకుల జాబితాను గల్లా సిద్ధం చేసినట్లు సమాచారం. దీనికి తోడు కుమారుడు గల్లా జయదేవ్ గుంటూరులో ఎంపీగా పోటీ చేస్తుండటంతో దృష్టి అంతా అటువైపే కేంద్రీకరించటంతో తన ఓటమి స్వయంకతాపరాధంగానే భావించ వచ్చు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పార్టీలకతీతంగా ఓ వీధిలో ఎన్ని ఇండ్లు ఉంటే అందరికీ నగదును పంపిణీ చేశారు.' ఇది ఆయన విజయ అవకాశాలకు బాగా దోహదపడింది. 2014 న చంద్రగిరి శాసనసభ్యులుగా విజయం

గల్లా కుటుంబ సభ్యుల ఫోటోలతో

సాధించిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గత గల్లా తరహాలో కాకుండా విభిన్న రీతిలో ఎల్లవేళలా ప్రజలతో మమేకమై వారి కష్ట సుఖాలలో భాగం పంచుకుంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కుటుంబ పెద్ద కొడుకుగా ప్రజల మన్ననలు పొందుతూ జిల్లాలోని ప్రముఖ నాయకులైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తర్వాత జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచారని విశ్లేషకులు బాహాటంగానే చెప్పుకోవటం విశేషం. ఈ తరహాలో పయనిస్తూ ప్రస్తుతం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆర్థికంగా అందనంత ఎత్తులోకి ఎదగటానికి ముఖ్యంగా గల్లా అరుణకుమారే కారణంగా చెప్పుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో పులివర్తి నాని తెలుగుదేశం పార్టీ టిక్కెట్ తెచ్చుకోగా నాయకుడు ముఖ్యం కాదు..... పార్టీకి పనిచేయాల్సిన గల్లా తన అనుచరులను మీ ఇష్టం మీరు ఏ పార్టీలైనా కొనసాగవచ్చు అని తెలపటంతో తన అనుయాయులు చాలావరకు వైయస్సార్సీపి లో చేరి పరోక్షంగా నాని ఓటమికి గల్లా కారణమయ్యారనే విమర్శలు మూటకట్టుకొన్నారు. నాని 2019లో ఓటమి చవిచూసినప్పటికీ అనునిత్యం పార్టీ కోసం పాటుపడుతూ ప్రజల మధ్యనే ఉంటూ వారికి అండగా నిలుస్తూ 2024 ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా బరిలో ఉన్నారు. గల్లా ఆశీస్సులు తనకు ఉంటాయని బడి ఎలా చెప్పగలుగుతున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ పర్యాయం కూడా నానిని, తెలుగుదేశం పార్టీని ఇరకాటం పెట్టే ప్రయత్నంలో భాగంగానే గల్లా చొరవతో బడి రంగంలోకి దిగినట్లు సమాచారం.

వైసీపీ నుండి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ 5వ వార్డు సాయి మాంబాపురం, చౌటూరు, బండారుపల్లి, నుండి వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. కుమార్, జ్యోతి, నాగరాజు, తిరునాక్కసులు, యువరాజు, శరవణ ముత్తు, కేశవ, ముత్తువేల్, షణ్ముగ, కార్తీక్, పిల్లారి పట్టు దళిత వాడ నుండి .బాబు, సుబ్రమణ్యం, దినేష్, ప్రవీణ్ కుమార్, విజయ్ కుమార్, ముని శేఖర్, ఉమా మహేష్‌కు ఆ పార్టీ నాయకులు గాలి భాను ప్రకాష్ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కబడ్డీ ఫైనల్‌లో 'కొత్తవీరాపురం' జట్టు విజేత

ప్రజాశక్తి -ఏర్పేడు: 'ఆడదాం ఆంధ్ర' అందరి ఆట అని మండల స్థాయిలో గెలిచి సత్తా చాటిన కొత్తవీరాపురం సచివాలయం టీమ్ నిరూపించింది. రసవత్తరంగా జరిగిన కబడ్డీ ఆట. మండల స్థాయి కబడ్డీ పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ ఏర్పేడు .మొత్తం 18 సచివాలయాల నుండి పోటీలు జరిగితే అందులో చివరికి కొత్తవీరాపురం గ్రామ సచివాలయం పంగూరు సచివాలయం టీమ్ లు పోటీ పడగా అందులో కొత్తవీరాపురం గ్రామ సచివాలయం విజేతగా నిలిచింది. పంగూరు గ్రామ సచివాలయం రన్నర్స్ గా నిలిచారు. ఈ మ్యాచ్ లకి సారథ్యంగా సచివాలయం సిబ్బంది, పాపనాయుడుపేట స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు, మునగలపాలెం స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు వర్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విజయనగర సామ్రాజ్య చక్రవర్తి పరిపాలనాధక్షుడు, దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన రాజు కృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకొని రాయలవారి విగ్రహానికి, వారి చిత్రపటానికి బుధవారం ఘన నివాళులు అర్పించారు. రాయలవారు పరిపాలనలో బంగారు ఆభరణాలను రాసులుగా పోసి రాయలసీమను రతనాలసీమగా పరిపాలించిన గొప్ప రాజు జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర కాపు సంక్షేమ సేన ఆర్గనైజింగ్ సెక్రటరీ, పుత్తూరు బలిజ సంఘం నాయకుడు జనసేన నాయకులు పి గోపి రాయల్, రాష్ట్ర కాపు సంక్షేమ శాఖ రైతు విభాగం ఉపాధ్యక్షుడు జి కృష్ణయ్య, బలిజ సంఘం నాయకులు కేశవులు, రవికుమార్, దామోదరం, గోపి, బాలు రాయల్, శేఖర్ రాయల్ పాల్గొని రాయలవారికి ఘన నివాళులర్పించారు. .

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీకృష్ణదేవరాయ 533వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కృష్ణదేవరాయల పాలన అన్ని తరాలకు ఆదర్శమన్నారు. ఆయన విగ్రహాన్ని త్వరలోనే రాజగోపురం వద్ద ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా 'దీవి ఇజ్తిమా'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఖాన్ ఖాహ్ షహ్ మిరియాహ్ కామాలియాహ్ కడప వారి ఆధ్వర్యంలో ఒక్కరోజు దివి ఈజ్తిమా (అవగాహన సదస్సు) ను ఘనంగా నిర్వహించారు. స్థానిక మసీదులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఖాన్ వాదం షహ్ మిరియాహ్ వైజ్ఞానిక, సాహిత్య సేవలు అనే అంశంపై సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా వ్యవహరించిన డాక్టర్ సయ్యద్ అబ్దుల్లా ఎస్ వి యూ మాజీ రిజిస్టర్ డాక్టర్ అబ్దుల్ హక్ సాహితీ సేవలను వివరించారు. సత్తార్ సాహిర్ సాహెబ్ అంటూ సాహితీని కొనియాడారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును పొందిన డాక్టర్ షఫీ మహమ్మద్ అలీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రియాజ్ అహ్మద్ సాహెబ్, జమీల బాషా, సుల్తాన్, కాజా పీర్ సాహెబ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

టీటీడీ ఫొటోగ్రాఫర్‌కు సన్మానం

ప్రజాశక్తి -తిరుపతి: టీటీడీ ఫొటోగ్రాఫర్ జయ శేఖర్ టిటిడి చీఫ్ ఫొటోగ్రాఫర్ గా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా బుధవారం టీటీడీ పరిపాలన భవనంలో తిరుపతి ప్రెస్ ఫొటోజర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయ శేఖర్‌ను దుశ్శాలువాతో సత్క రించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రెస్ ఫొటోజర్నలిస్ట్ అసోసి యేషన్ ప్రసిడెంట్ , హన్స్ ఇండియా ఫొటోగ్రాఫర్ కె.రాధాకృష్ణ, సెక్రటరీ ఆంధ్రజ్యోతి లావణ్య కుమార్ , వైస్ ప్రసిడెంట్ విశాలాంధ్ర ఫొటోగ్రాఫర్ కె రాధాకృష్ణ యాదవ్, స్టేట్ లీడర్ కె.గిరి బాబు కమిటీ మెంబర్స్ సీనియర్ ఫొటోగ్రాఫర్స్ పూర్ణ చంద్రరావు , రామకృష్ణ, రఫీ, శ్రీనివాసులు సోమశేఖర్ పాల్గొన్నారు.

కూటమికి 160 సీట్లు: కోటంరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమికి 160 సీట్లు వస్తాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో బుధవారం చంద్రబాబు 'కదలిరా బహిరంగ సభ' పై సన్నాహక సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిశీలకుడుగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బొజ్జల అంటే శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి అంటే బొజ్జల అని కితాబిచ్చారు. ఈనెల 19న వెంకటగిరిలో జరిగే కదలిరా సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, మలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రికెట్ లో 'బండారుపల్లి' జట్టు విజయం

ప్రజాశక్తి- ఏర్పేడు :మన సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా ఏర్పేడు మండలానికి సంబంధించి 40 టీమ్‌లు పాల్గొనగా బండారుపల్లి సచివాలయం, చెల్లూరు సచివాలయం మధ్య కుప్పయ్య కండ్రిగ గ్రౌండ్ లో జరిగిన క్రికెట్ ఫైనల్ లో చెల్లూరు పైన 15 పరుగులు తేడాతో బండారుపల్లి , మన్నసముద్రం జట్టు మండల స్థాయిలో గెలుపొంది నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత పొందింది.

స్విమ్స్‌కు 10 వీల్ చైర్స్ విరాళం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రిలో శాశ్వత ఉద్యోగిగా 30సంవత్సరాలు పాటు న్యూరోసర్జరీ విభాగంలో(ఎయన్‌యం) గా పనిచేస్తూ మృతి చెందిన యం సుధారాణి జ్ఞాపకార్థం స్విమ్స్ ఆసుపత్రికి యాభైవేల రూపాయల విలువచేసే 10 వీల్ ఛైర్స్ విరాళంగా అందజేశారు. స్థానిక స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వికుమార్ కి దాతలు బుధవారం అందించారు. ఈ సందర్భంగా సుధారాణి భర్త సి సత్య కిషోర్ మాట్లాడుతూ తన భార్య సుధారాణి స్విమ్స్ న్యూరో సర్జరీ విభాగంలో 30 సంవత్సరాలుగా ఎయన్‌యం గా పనిచేస్తూ అనారోగ్యం కారణంగా మృతి చెందిదని, ఆమె జ్ఞాపకార్థం రూ. 50 వేలు విలువగల 10 వీల్ ఛైర్స్ విరాళంగా ఇచ్చానని తెలిపారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ సుధారాణి స్విమ్స్ కు చేసిన సేవలను కొనియాడారు. విరాళం ఇచ్చిన సి సత్య కిషోర్, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి ఈ వీల్ ఛైర్స్ ను పేషెంట్ల సౌకర్యార్థం వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధారాణి కుమారుడు సి.పార్థు, కుమార్తె సి తనూజ పాల్గొన్నారు.

'రా..కదలిరా..' సభను జయప్రదం చేయండి: టిడిపి

ప్రజాశక్తి -కెవిబి పురం: ఈ నెల 19వ తేదీ వెంకటగిరిలో నిర్వహించనున్న ' రా.. కదలిరా..' అనే సభకు అధిక సంఖ్యలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కెవిబి పుర మండలం టిడిపి అధ్యక్షులు రామాంజులు నాయుడు కోరారు. సాయి బాబా గుడి వద్ద శివరావ్ రైస్ మిల్లు ఆవరణలో టిడిపి నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షులు గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలం నుంచి రైతులు మహిళలు విరివిగా పాల్గొని మన సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గం యువత అధ్యక్షులు లక్ష్మీపతి రాజు, తిరుపతి పార్లమెంటు క్రిస్టియన్ సెల్ విభాగం అధ్యక్షులు బసవయ్య, కే వి బి పురం మండల జనసేన అధ్యక్షులు థామస్, అవసరం సురేష్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ నాయుడు మాజీ యంఎ పి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

- గిరిజన ఇళ్లలోకి ప్రవేశం
- పరిసరాలు దుర్గంధభరితం
- ఆందోళనలో గిరిజనులు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -బాలాయపల్లి: తరాలు మారినా..ప్రభుత్వాలు మారినా గిరిజల బతుకులు మాత్రం మారలేదు. తాగునీరు వృథా కారణంగాఆ పరిసర ప్రాంతం నీటి మడుగులా మారి దుర్గంధ భరితంగా మారింది. అక్కడి పంచాయతీ పైపు నుంచి నీరు గిరిజనుల ఇళ్లలోకి ప్రవేశిస్తోంది. ఈ కారణంగా చుట్టుపక్కల దోమలు అధికమై విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం వుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి కోడి కూత దూరంలో ఈ దుస్థితి వుండటం గమనార్హం.

ఇళ్లలోకి ప్రవేశిస్తున్న మురుగు నీరు

గిరిజన ఇళ్లలోకి నీళ్లు

స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి కోడికూత దూరంలో గిరిజన కాలనీ వుంది. అక్కడ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపునుంచి నీళ్లు వృథాగా పోతున్నాయి. ఫలితంగా నీరు చుట్టుపక్కల నిలిచిపోయి మడుగులా మారింది. అదే నీరు గురిజనుల ఇళ్లల్లోకి వస్తుండడంతో అక్కడ నివసిస్తున్న గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

పరిసరాలు దర్గంధభరితం

పరిసర ప్రాంతాలు దుర్గంధ భరితంగా మారి దోమలు అధిక మయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో దోమలు కారణంగా కంటి మీద కునుకు పట్టడం లేదని వాపో తున్నారు. పంచా యతీ పైపు నుంచి నీరు వస్తున్నా అధికా రులు పట్టించు కోవడం లేదని ఆవేద న వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో గిరిజనులు

దోమల కారణంగా విష జ్వరాలు వస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తు న్నారు. ఈ విషయాన్ని గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని గిరిజనులు వాపోయారు. వృథాగా పోతున్న నీటిని అరికట్టి తమ ఇళ్లలోకి నీటిని రానివ్వకుండా అడ్డుకోవాలని వారు కోరుతున్నారు. మురుగు నీరు కారణంగా ఇళ్లలో భోజనం చేయలేని దుస్థితి తమకు ఏర్పడిందని వారు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి వృథా నీటిని నిరోధించి దుర్గంధాన్ని తొలగించి తమ సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు. తాము రోగాల బారిన పడకముందే అధికారులు స్పందించాలని అభ్యర్థిస్తున్నారు.

వృథాగా పోతున్న పంచాయితీ పైపు నీరు

విజేతలకు బహుమతులు అందిస్తున్న టిడిపి నాయకులు భానుప్రకాష్

క్రీడలు ఎంతో అవసరం: భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం అని నగరి నియోజక వర్గ టిడిపి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపాల్టీ గేట్ పుత్తూరు యూత్ ఆధ్వర్యం లో నిర్వహించిన సంక్రాంతిని పురస్క రించుకొని క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఫైనల్‌లో గెలుపొందిన విజేతలకు బహుమ తులు నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్. చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని, టిడిపి హయాంలో క్రీడా రంగానికి ఎంతో ప్రోత్సాహమిచ్చి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. వచ్చే టిడిపి ప్రభుత్వంలోనూ క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు, యువకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-తడ: తడ మండలం లోని కారూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. ఈ పోటీలలో 150 మంది పాల్గొనగా అందులో ఐదుగురు గెలుపొందారు. వారికి బహుమతులు అందించారు. మొదటి బహుమతి ఎయిర్ కూలర్, రెండవ బహుమతి మిక్సీ, మూడవ బహుమతి మంచం, నాల్గవ బహుమతి చిన్న ఫ్యాన్, ఐదవ బహుమతి కుక్కర్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జేసీ యస్ కన్వీనర్ సుందర్ రెడ్డి, మండల యువజన నాయకులు తిరుమల రెడ్డి, నాయకులు మునస్వామి రెడ్డి, గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం.. అన్నదానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం 10గంటలకు స్థానిక కార్వేటినగరం కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తారని ఉదయం 11గంటలకు కెనరా బ్యాంకు ఎదురుగా ఉచిత మెగా వైద్య శిబిరం, అన్నదానం నిర్వహిస్తున్నామని చిత్తూరు పార్లమెంటరీ టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు రావిళ్ళ మాధవ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కుటుంబ సభ్యులు, ఎన్‌టిఆర్ అభిమానులు, బాలకృష్ణ అభిమానులు, అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు జి.జీవరత్నం నాయుడు, ప్రధానకార్యదర్శి ఎన్ఎన్‌ధనపాల్ కోరారు. ఈ సమావేశంలో పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ బిఆర్‌యుగంధర్, మాజీ వైస్ ఛైర్మన్ ఏ ఆనంద్, 22వ వార్డు అధ్యక్షుడు కన్నన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా వైస్ ప్రసిడెంట్‌గా పటాన్ మస్తాన్ బాష

ప్రజాశక్తి-పాకాల: కాంగ్రెస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా వైస్ ప్రసిడెంట్‌గా పటాన్ బాషను నియమిస్తున్నట్లు ఏఐసిసి జాతీ య నాయకులు బుధవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పఠాన్ మస్తాన్ బాష బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవీ బాధ్యతలు తనకు అప్పగించిన నేషనల్ లీడర్స్, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సిడబ్ల్యూసి సభ్యులు రఘు వీరారెడ్డి, రుద్రరాజు, స్టేట్ లీడర్ పిసిసి ప్రసిడెంట్ వైఎస్ షర్మిల, పిసిసి వైస్ ప్రసిడెంట్ వేణుగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షులు పోటురు భాస్కర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని, అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ముస్లిం మైనార్టీలకు, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి తోడ్పడిన పార్టీ కాంగ్రెస్ అని, ఇంకా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే కాంగ్రెస్‌ని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పాకాల మండల ప్రసిడెంట్ మహబూబ్ బాషా, ఇంతియాజ్, షేక్ హుస్సేన్, షేరు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న పటాన్ బాష

'స్వచ్ఛత'లో యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

ప్రజాశక్తి -రేణిగుంట : బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో సాఫ్ట్‌వేరు ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న యువ ఇంజనీర్లు సంక్రాంతి సెలవులు సందర్భంగా తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. రేణిగుంట మండలం ఆర్ మల్లవరం పంచాయతీ గ్రామానికి చెందిన యువ సాఫ్ట్‌వేరు ఇంజనీర్లు బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగను తమ సొంత గ్రామంలో కుటుంబ సభ్యులతో ఆనం దంగా పండుగ సంబరాలను జరుపు కోవాలని గ్రామానికి చేరుకున్నారు. కానీ ఆర్ మల్లవరం నుంచి ఎస్సీపురం వరకు రెండు కిలోమీటర్లు రోడ్డుకి ఇరు వైపులా పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మందు బాటిళ్లు దర్శనమిచ్చాయి. ఇవి చూసిన యువ సాఫ్ట్వేర్ ఇంజనీర్లు నడుం బిగించారు. గ్రామాల్లో వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించి సుమారు రెండు కిలోమీటర్లు ఆర్ మల్లవరం నుంచి ఎస్సీపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ సీసాలు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యువ ఇంజనీర్లు జగన్మోహన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జయ కుమార్ రెడ్డి, కోహిత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం కృషి చేసిన యువకులను గ్రామ పెద్దలు సుబ్రమణ్యం రెడ్డి, మహదేవరెడ్డి అభినందించారు.

పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

మా సమస్యలు పరిష్కరించండి..

- మిమ్మల్ని గెలిపించు కుంటాం..
- టిడిపి నాయకులకు మహిళల అభ్యర్థన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వైసీపీ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే వున్నాయని, టిడిపి హయాంలో వేసిన రోడ్లు, ఎల్ఈడి దీపాలు తప్ప వాటి మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడిం దని, వాటిని పరిష్కరిస్తే మిమ్మల్ని గెలిపించు కుంటామని మహిళలు టిడిపి నాయకులను కోరారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ లో భాగంగా పలు వార్డుల్లో టిడిపినాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం గా పలువురు మహిళలు టిడిపి నాయ కులకు ఘన స్వాగతం పలికారు. తాము తమ ఊర్లలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వాటిని పరిష్క రిస్తే తప్పక గెలిపించు కుంటామన్నారు. స్పందించిన గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ తాము అధికారంలో కొస్తే సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని తమను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పట్టణ టిడిపి ప్రసిడెంటు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ ప్రసిడెంట్ షణ్ముగరెడ్డి, మణి రెడ్డి , సంతోష్, అర్జున్ రెడ్డి, చొక్కాలింగ రెడ్డి,చిరంజీవి, వెంకటముని, ఆర్ముగాం రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, 5 వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): సంక్రాంతి సందర్భంగా చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ కొండచుట్టు ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి పలువురు పట్టు వస్త్రాలు సమర్పించారు. బుధవారం స్థానిక శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి , టిడిపి నాయకురాలు సుధా రెడ్డి , టిడిపి నాయకులు మూలస్థాన ఎల్లమ్మకు పట్టు వస్త్రాలను కోదండరామ స్వామి ఆలయం నుండి మంగళ వాయిద్యాలు ఓం శక్తి నామస్మరణల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో తిమ్మారెడ్డి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ దుష్ట శక్తుల నుండి చంద్రగి రిని కాపాడాలని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. సుధా రెడ్డితోపాటు టిడిపి నాయ కులు గౌస్ బాషా, అమ్ములు, నాగరాజు రాయల్, నాయకులు, మహిళలు, కార్యకర్తలు. ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు ఈవో తిమ్మారెడ్డి, చైర్మన్ యరాశి చంద్రశేఖర్ రెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే

కోలాహలంగా జల్లికట్టు

ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం మల్లయ్య పల్లి, దోర్నకంబాల మడపం పల్లి గ్రామాలలో ముక్కనుమ సందర్భంగా బుధవారం జల్లికట్టు సంబరాలు కోలహలంగా నిర్వహించారు. పశువుల కాపర్లు తమ పశువులను చన్నీటితో స్నానాలు ఆచరింపజేసి దొడ్లలో నిలిపి కొమ్ములకు ముందు తయారు చేసుకున్న చెక్క పలకలను అలంకరింపజేశారు. పలువురు తమ కోడె గిత్తలకు తమ అభిమాన పార్టీ నాయకుల ఫొటోలను జెండాలను వెదురు ప్రభలతో కట్టారు. ముందుగా నడివీధి గంగమ్మకు పూజలు నిర్వహించారు. గ్రామ నడివీధిలో నిర్ణయించిన చోట నీళ్లు పోసి అల్లి ఏర్పాటు చేశారు. దొడ్ల వద్ద గుమ్మడికాయ నిమ్మ పండు కొబ్బరికాయలతో దిష్టి తీసి పశువులను వదిలారు. యువకులు ముందు దారి చూపుతుంటే పశువులను వెనుక వైపు నుంచి డప్పులతో బెదిరించారు. పశువులు వేగంగా దూసుకు వెళుతూ పట్టుకోవడానికి ప్రయత్నించిన యువకులను కొమ్ములతో బెదిరిస్తూ పరిగెత్తాయి. పరిగెత్తే పశువులను నిలువరించడానికి ప్రయత్నించి యువకులు పలువురు కిందపడి గాయాల పాలయ్యారు. మల్లయ్య పల్లెలో ఒక్కరికి ఎదరొమ్ము పైన కొమ్ముతో గాయం కాగా అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ముక్కు, చెవులలో నుంచి రక్తం రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పలువురికి చిన్నపాటి గాయాలయ్యాయి. వేలాదిమంది పలు ప్రదేశాల నుంచి జల్లికట్టును తిలకించడానికి పశువులను పట్టుకోవడానికి గ్రామాలకు చేరుకున్నారు. దొరికిన పశువులను ఒడిసి పట్టుకొని చక్క పలకలను స్వాధీనం చేసుకుని కేరింతలు కొట్టారు. వారందరికీ గ్రామ పెద్దలు తాగునీటి సౌకర్యంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు.

క్రైం న్యూస్

స్కూటర్‌ను ఢీకొన్న కారు

స్కూటరిస్టు మృతి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): స్కూటరును కారు ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. చంద్రగిరి బైపాస్ రహదారి సర్వీస్ రోడ్డులో బుధవారం ఉదయం స్కూటర్ ను కారు ఢీకొనడంతో స్కూటరిస్ట్ గంగాధరం (48) తీవ్ర రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రగిరి మండలం నిరశింగాపురం గ్రామానికి చెందిన గంగాధరం పుట్టాలమ్మ ఆలయం ఎదురుగా వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం చంద్రగిరి నుంచి ఐతేపల్లి వద్ద గల అయ్యప్ప స్వామి దర్శనానికి స్కూటర్ లో బయలుదేరారు. చంద్రగిరి బైపాస్ రహదారి సర్వీస్ రోడ్ లో వెళుతున్న గంగాధరం స్కూటర్ ను మహల్ క్రాస్ సమీపంలో తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళు న్న కారు బలంగా వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్ట్ కిందపడి తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గంగాధరానికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. చంద్రగిరి పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో మృతి చెందిన గంగాధరం

రెండు బైకులు ఢీ స్కూటరిస్టుకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -తడ: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఢీకొన్న ద్విచక్ర వాహనదారులు కిందపడి స్వల్పగాయాలపాలైన సంఘటన తడ లోని జాతీయ రహదారిపై బిగ్ స్టే అపార్ట్ మెంట్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు తడ నుండి చెన్నైకు ఒక ఫ్యామిలీ స్కూటీలో వెళు తుండగా సూళ్లూరుపేట నుండి చెన్నైకు బైకులో వెళుతున్న వారు స్కూటీని వెనుక నుండి ఢీకొట్టడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో వెనుక నుండి ఢీకొన్న వారు స్వల్పగాయాల పాల య్యారు. ఎవరికీ పెద్ద ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చు కుని సర్దుకుని తమ తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

వైసిపి నాయకుడికి నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

గుండెపోటుతో వైసీపీ సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామంలో నేదరుమల్లి జనార్దన్ రెడ్డి అనుచరుడు సీనియర్ రాజకీయ నాయకులు పెట్లూరు వీరారెడ్డి గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త రామ్‌కుమార్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వీరారెడ్డి భౌతిక కాయానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరారెడ్డి నేదురు మళ్ళీ అనుచరుడుగా వెంకటగిరి రూరల్ మండలంలో కాంగ్రెస్‌కి ఎనలేని సేవ చేసిన గుర్తింపు పొందారని 2019ల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేశారన్నారు. పెట్లూరు నాయుడుపేట రోడ్డు నుండి పెట్లూరు రోడ్డు నేదురుమల్లి రాజలక్ష్మి ఆర్చి నిర్మాణ ప్రదాత ఇక లేరనే విషయం తెలిసిఆ గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు. ఈ అంతిమ యాత్రలో వైసిపి నాయకులు ఆల్తూరు పాడు దశయ్య, పలుగోడు రమణారెడ్డి, మల్లి రెడ్డి, హరిరెడ్డి, శ్రావణ్ కుమార్ బిజెపి, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ శాతరాసి బాలయ్య ఉన్నారు.

టిడిపి నాయకుని మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిధిలోని వేణుంబాకం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కొమ్మల శంకరయ్య(48) మంగళవారం రాత్రి మృతి చెందాడు. శంకరయ్య కొన్ని రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. మంగళవారం ఆరోగ్యం క్షీణించి పరిస్థితి సీరియస్ కావడంతో అతడిని హాస్పిటల్‌కి తీసుకుని వెళుతుండగా మృతి చెందినట్లు తెలిపారు. బుధవారం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు ఏర్పాటు చేశారు. శంకర్ మృతదేహం వద్దకు మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాస నాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోనుజకరయ్య మైనార్టీ అధ్యక్షులు ఎస్ కే షబీర్ ఏకోళ్ల మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్ పలువురు మహిళా నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరసా మాట్లాడుతూ కొమ్మల శంకరయ్య మృతితో పార్టీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత ఆయనదే అన్నారు.

In the Court of the Principal Junior Civil Judge : Gudur

E.P.No. 40 / 2020

O.S.No. 251 / 2019

Dharmichand Arunkumar - D.H.R

Vs

Renati Venkata Narayana - J.D.R

Notice To J.D.R

Renati Venkata Narayana, S/o **Chinna Guraviah@ Guravaiah,**R/o D.No.9-71-2, Nalajalamma Street, East Gudur, Gudur Mandal, SPSR Nellore District.

పై నెంబరు కేసులో డిక్రీ హోల్డర్ మీ మీద పై వారి కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో ఆర్డర్ 21 రూరల్ 66 నోటీసు నిమిత్తం **తే1-2-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎ.వి.రాఘవ రెడ్డి, బి.ఎల్.,
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది, గూడూరు.
సెల్: **70132 05831**